శిథిలమవుతున్న 'డబుల్' ఇళ్లు

- గోడలకు పగుళ్లు
- 27 ఇళ్లు పిల్లర్లకే పరిమితం
- ధ్వంసమైన విద్యుత్ మీటర్లు, కిటికీలు

డోర్నకల్: డోర్నకల్ మండలం వెన్నారం గ్రామంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లు పంపిణీకి నోచుకోక శిథిలమవుతున్నాయి. సుమారు ఏడేళ్ల క్రితం గ్రామంలో 70 డబుల్ బెడ్రూ ఇళ్ల నిర్మాణం కోసం 2017 మే 23న అప్పటి ఎమ్మెల్యే డీఎస్ రెడ్యా నాయక్ శంకుస్థాపన చేశారు. నిర్మాణ పనులు ప్రారంభమైన సంవత్సర కాలంలో 18 ఇళ్లను పూర్తి చేశారు. మూడేళ్ల తరువాత మరో 25 ఇళ్ల నిర్మాణం పూర్తి చేయగా, మరో 27 ఇళ్లు పిల్లర్ల స్థాయిలోనే నిర్మాణ పనులు నిలిచాయి. ఇళ్ల నిర్మాణం పూర్తయిన తరువాత సిమెంటు రోడ్లు, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు అమర్చి మీటర్లు, స్విచ్ బోర్డులను ఏర్పాటు చేశారు. ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి సంవత్సరాలు గడుస్తున్నా లబ్ధిదారులకు పంపిణీ చేయకపోవడంతో ఇళ్లు శిథిలమవుతున్నాయి.

ఊడిన విద్యుత్ మీటర్లు

నిర్మాణ పనులు పూర్తయిన ఇళ్లకు సంబంధించి కొన్ని ఇళ్ల గోడలకు పగుళ్లు వచ్చాయి. ఇంటి తలుపులు, కిటికీలు విరిగి వేలాడుతున్నాయి. విద్యుత్ మీటర్లు ఊడి గాలిలో వేలాడుతుండగా, గదుల్లోని స్విచ్ బోర్డులు ధ్వంసమయ్యాయి. ఇళ్ల మధ్య పిచ్చి మొక్కలతో అడవిని తలపిస్తున్నాయి. ఇళ్లు ఖాళీగా ఉండటంతో కొంతమంది గదుల్లో పశువులు, మేకలను కట్టేస్తున్నారు. కొన్ని గదుల్లో పేక ముక్కలు, మద్యం సీసాలు, సిగరెట్ పీకలు దర్శనిస్తున్నాయి. ఇప్పటికే గదులకు సంబంధించిన తలుపులు, కిటికీలు, విద్యుత్ వైర్లు, స్విచ్‌బోర్డులు చోరీకి గురయ్యాయి. గతంలో ఉమ్మడి వెన్నారం గ్రామపంచాయతీ పరిధిలోని 177మంది డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోగా, ఇటీవల ప్రజాపాలనలోనూ ఇందిరమ్మ ఇళ్ల కోసం పెద్ద సంఖ్యలో గ్రామస్తులు ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. అధికారులు వెంటనే స్పందించి మధ్యలో నిలిచిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి, శిథిలమైన ఇళ్లకు మరమ్మతులు చేసి అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.


పూర్తయిన డబుల్ బెడ్రూం ఇళ్లు


ఇళ్ల మధ్య పెరిగిన పిచ్చి మొక్కలు


పిల్లర్ల దశలో నిలిచిన పనులు


పగిలిన కిటికీ అద్దాలు, వేలాడుతున్న విద్యుత్ మీటరు


పగుళ్లు ఏర్పడిన మెట్ల పిల్లర్

క్లుప్తంగా

సీడీఓ, పీపీ, ఎస్సైని సత్కరించిన ఎస్పీ



మహబూబాబాద్ రూరల్: గంజాయి కేసులో నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన కోర్టు డ్యూటీ ఆఫీసర్ నవీన్ కుమార్, జిల్లా కోర్టు పీపీ చిలుకమారి వెంకటేశ్వర్లు, కోర్టు లైజనింగ్ ఆఫీసర్ పవన్‌కుమార్‌ను ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ బుధవారం సత్కరించారు. గంజాయి కేసులో పట్టుబడ్డ నిందితులకు జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ చిలుకమారి వెంకటేశ్వర్లు ఒక్కొక్కరికి 20 సంవత్సరాల కఠిన కారాగారా శిక్ష, రూ.2 లక్షల చొప్పున జరిమానా విధించేందుకు కోర్టులో వాదనలు వినిపించారన్నారు. ఈమేరకు నిందితులకు శిక్షపడేలా కృషి చేసిన వారిని ఎస్పీ సత్కరించారు. డీఎస్పీ తిరుపతిరావు, సీఐ ఉపేందర్ పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

మరిపెడ రూరల్: వీధి కుక్కల పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, గ్రామాల్లోని కుక్కల బెడద ఉంటే గ్రామ ప్రత్యేక అధికారి దృష్టికి తీసుకెళ్లాలని జిల్లా వైద్యాశాఖ అధికారి బి.కళావతి బాయి అన్నారు. మరిపెడ మండలం ఎడ్జెర్ల గ్రామంలో ఇటీవల కుక్క కాటుతో మృతి చెందిన పూలమ్మ ఇంటిని, గ్రామంలోని సబ్ సెంటర్‌ను జిల్లా వైద్యాధికారిని బుధవారం సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సారంగం, డాక్టర్ శ్రావణ్‌కుమార్, వడ్డెబోయిన శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

317జీఓ సమస్య పరిష్కరించాలి

మహబూబాబాద్ అర్బన్: ఎన్నో ఆశలతో ఉపాధ్యాయులు సొంత జిల్లాకు వెళ్లాలని ఎదురు చూస్తున్న 317 జీఓ ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్య ఆగస్టు 3 వరకు పరిష్కరించాలని పీఆర్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి పులి దేవేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని యూనియన్ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. కాలయాపన చేయకుండా త్వరగా సమస్యను పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు సుధాకర్, రాంజీ, రాజమౌళి, ప్రవీణ్ పాల్గొన్నారు.

'అధికారుల నిర్లక్ష్యంతోనే ఆగిన ప్రమోషన్'



నెల్లికుదురు: డీఈఓ కార్యాలయ అధికారుల నిర్లక్ష్యంతోనే నా ప్రమోషన్ నిలిచిపోయిందని బాధిత ఎస్‌జీటీ ఉపాధ్యాయుడు పెరుమాండ్ల యాదగిరి ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇటీవలే ప్రభుత్వం చేపట్టిన లెఫ్టోవర్ ప్రమోషన్లలో తన ప్రమోషన్ నిలిపారని తెలిపాడు. పీఎస్ హెచ్‌ఎం పోస్టుకు ప్రమోషన్ వచ్చిన తనకు పాఠశాల కేటాయించకుండా నిర్లక్ష్యం చేశారని తెలిపారు. డీఈఓ స్పందించి న్యాయం చేయాలని కోరాడు.

ఉద్యమించాలి

గూడూరు: ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టేంత వరకు మాదిగలు ఉద్యమించాల్సిన అవసరం ఉందని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి కొండ్ర ఎల్లయ్యమాదిగ అన్నారు. బుధవారం ఆగస్టు 9న ఢిల్లీలో జరుగు కార్యక్రమ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బోడ సూరయ్య, ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ బోడ ఎల్లయ్యమాదిగ, నాయకులు రాము, సాయిలు, చంద్రయ్య, వెంకన్న పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక


కార్యదర్శులు

మహబూబాబాద్ అర్బన్: జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు డీసీఈబీ నూతన కమిటీ నేరడ పాఠశాల హెచ్‌ఎం వాంకుడోత్ బాలాజీ నాయక్, విద్యాశాఖ అసిస్టెంట్ సెక్రటరీ సమ్మెట సతీష్‌లను కార్యదర్శులుగా ఎనుకున్నట్లు డీఈఓ రామారావు బుధవారం తెలిపారు. ఈ కమిటీలో ప్రధానోపాధ్యాయులు, ప్రైవేట్ పాఠశాలల ప్రిన్సిపాళ్లు, కేజీబీవీ ప్రత్యేక అధికారులు సభ్యులుగా ఉంటారన్నారు. అనంతరం ప్రభుత్వ బాలికల పాఠశాలలో భౌతిక, జీవ శాస్త్ర స్కూల్ కాంప్లెక్స్ ఆర్పీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

గిరిజన సమస్యలపై వినతులు

మహబూబాబాద్ అర్బన్: జిల్లా వ్యాప్తంగా ఉన్న గిరిజనుల సమస్యలపై నేడు జిల్లా కేంద్రంలో కలెక్టర్ కార్యాలయంలో ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ సమక్షంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు బీజేపీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్ బుధవారం తెలిపాడు. జాటోత్ హుస్సేన్ పర్యటన సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలో ఉదయం 11గంటలకు వివిధ ప్రభుత్వ శాఖల అధికారుల సమావేశంలో సమస్యలు పరిష్కరిస్తారన్నారు. ఈ సమావేశంలో నాయకులు అశోక్, అజేయ్, సందీప్, బాలు నాయక్, నరేష్, సందీప్ పాల్గొన్నారు.

బురద రోడ్డుపై నాటువేసి నిరసన


నిరసన తెలుపుతున్న కౌన్సిలర్, కాలనీవాసులు

మహబూబాబాద్: కురుస్తున్న వర్షాలతో బురదమయంగా మారిన రోడ్లకు మరమ్మతులు చేయాలని వార్డు కౌన్సిలర్ మార్నెని శ్రీదేవి డిమాండ్ చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని 23వ వార్డులో పలు కాలనీల్లో వర్షాలకు రోడ్లు బురదమయంగా మారడంతో బుధవారం వార్డు కౌన్సిలర్ శ్రీదేవి, ఆయా కాలనీవాసులు బురద రోడ్డుపై నాటు వేసి నిరసన తెలిపారు. ఈసందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ.. రోడ్లకు మరమ్మతులు చేయాలని ఎమ్మెల్యే మురళీనాయక్, మున్సిపల్ అధికారులకు విన్నవించినా స్పందన లేదన్నారు. ఎమ్మెల్యే తన సీడీఎఫ్ నిధుల నుంచి ప్రతి వార్డుకు రూ.5లక్షలు కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సత్యనారాయణ, నాగలక్ష్మి, బాలు, సలీమా, శ్రీలత, అనిత, జ్యోతి, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

అపరిచితులకు ఆశ్రయం కల్పించొద్దు


గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ బాబూరావు

కొత్తగూడ: పరిచయం లేని వ్యక్తులకు గ్రామంలో ఆశ్రయం కల్పించ వద్దని గూడూరు సీఐ బాబూరావు సూచించారు. బుదవారం మండలంలోని ముస్మి గ్రామస్తులతో ఆయన మాట్లాడారు. మావోయిస్ట్ వారోత్సవాలను పురస్కరించుకుని గుర్తు తెలియని వ్యక్తులు గ్రామాలకు వచ్చే అవకాశాలు ఉన్నాయని అన్నారు. అలాంటి వారికి ఆశ్రయం కల్పిస్తే చట్టపరంగా నేరస్తులవుతారని వివరించారు. అనుమానాస్పదంగా ఎవరు కనిపించినా సమాచారం ఇవ్వాలని కోరారు. ముందుగా మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఆటో డ్రైవర్లతో మాట్లాడారు. చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్లకుండా ముందస్తు బైండోవర్ చేశారు. ఆయన వెంట కొత్తగూడ, గంగారం ఎస్సైలు కుశకుమార్, రవికుమార్ ఉన్నారు.

ఉపాధ్యాయుల సేవలు వెలకట్టలేనివి


తొర్రూరు: హెచ్‌ఎంను సన్మానిస్తున్న ఎంఈఓ

తొర్రూరు: విద్యారంగంలో ఉపాధ్యాయుల సేవలను వెలకట్టలేమని ఎంఈఓ గుగులోతు రాము అన్నారు. డివిజన్ కేంద్రంలోని అంబేడ్కర్ నగర్ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎంగా విధులు నిర్వర్తిస్తూ పదవీ విరమణ పొందుతున్న రాజసుకన్యను ఎంఈఓ రాములు, మాజీ జెడ్పీటీసీ మంగళపెల్లి శ్రీనివాస్‌తోపాటు ఉపాధ్యాయులు పూలమాలలు, శాలువాలు, బహుమతులతో బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సునీత, సంధ్యారాణి, ప్రవీణ్‌కుమార్, శిరీష, శ్రీనివాస్, ఉపేందర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయాలి

దంతాలపల్లి: ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేసినప్పుడే వారికి మంచి గుర్తింపు వస్తుందని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సంక బద్రినారాయణ అన్నారు. మండలంలోని కుమ్మరికుంట్ల ఎంపీపీఎస్ పాఠశాల ఎల్‌ఎఫ్‌ఎల్ ప్రధానోపాధ్యాయులు చంద్రమౌళి పదవీ విరమణ బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కొండ యాకన్న, తుక్కారి రవీందర్, ఎంఈఓ రాము, మండల నోడల్ అధికారి శ్రీదేవి, కాంప్లెక్స్ హెచ్‌ఎం వేణుమాధవరెడ్డి పాల్గొన్నారు.

జంక్షన్ అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం


నిరసన తెలుపుతున్న నాయకులు

నెహ్రూసెంటర్: జిల్లా కేంద్రంలోని మూడుకోట్ల సెంటర్ జంక్షన్‌ను అభివృద్ధి చేయాలని సీపీఐ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి డిమాండ్ చేశారు. జంక్షన్ అభివృద్ధి పనుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం రోడ్డుపై బైటాయించి నిరసన తెలిపారు. ఈసందర్భంగా అజయ్‌సారథిరెడ్డి మాట్లాడుతూ.. జిల్లా కేంద్రం నుంచి ప్రధాన ప్రాంతాలకు వెళ్లే 5 రోడ్లకు కూడలిగా ఉందని, గత బీఆర్ఎస్ ఎమ్మెల్యే శంకర్ నాయక్ నిర్లక్ష్యం కారణంగా అభివృద్ధి నిలిచిందని, జంక్షన్ అభివృద్ధి కోసం స్వచ్ఛందంగా ఇంటి యజమానులు ఇళ్లను తొలగించినప్పటికీ అధికారులు అభివృద్ధి చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యహరిస్తున్నారని మండిపడ్డారు. మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, అధికారుల కారణంగా దుస్థితి ఏర్పడిందన్నారు. జంక్షన్ అభివృద్ధికి నిర్లక్ష్యాన్ని వీడాలని లేనిపక్షంలో పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, మామిండ్ల సాంబలక్ష్మీ, వెలుగు శ్రావణ్, మాలోత్ రవీందర్, మంద శంకర్, హర్షవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల ముందస్తు అరెస్టు

కేసముద్రం: హైదరాబాద్‌లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జరిగే ధర్నా సందర్భంగా బుధవారం మండల కేంద్రంలో నలుగురు సివిల్ సప్లై హమాలీ కార్మికులను ముందస్తు అరెస్టు చేసినట్లు ఎస్సై మురళీధర్‌రాజు తెలిపారు.

అక్రమ అరెస్ట్ సరికాదు

బయ్యారం/కురవి: పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి బానోత్ దేవేందర్‌ను పోలీసులు అరెస్ట్ చేయటం అక్రమమని పీడీఎస్‌యూ మండల నాయకులు సిద్దు, వినేష్, ప్రకాష్ అన్నారు. బుధవారం బయ్యారంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంను ప్రశ్నిస్తున్న తమ నాయకులను పోలీసులు అరెస్ట్ చేయటం సరికాదని, వెంటనే విడుదల చేయాలన్నారు.

నూతన చట్టాలపై అవగాహన ఉండాలి


గూడూరు: మాట్లాడుతున్న షీటీం ఎస్సై సునంద

గూడూరు: మహిళలు, బాలికలు కొత్త రక్షణ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని షీటీం ఎస్సై సునంద, సీఐ బాబూరావు, సైబర్ సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో బుధవారం ఎస్పీ ఆదేశాల మేరకు గూడూరు పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. సైబర్ నేరాలపై అవగాహన ఉండాలని సూచించారు. కార్యక్రమంలో భరోసా లీగల్ అడ్వైజర్ సాహిత్య, షీటీం సిబ్బంది రమేష్, మహబూబాబాద్ పోలీసు కళాజాత బృంద సభ్యులు రాజు, తిరుపతి, హెడ్ కానిస్టేబుల్ భిక్షనాయక్, అమ్మ, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి

కేసముద్రం: యువత చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా, వాటికి దూరంగా ఉండాలని ఎస్సై మురళీధర్‌రాజు సూచించారు. బుధవారం కేసముద్రంవిలేజ్‌లోని జెడ్పీహైస్కూల్‌లో నూతన చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

అప్రమత్తంగా ఉండాలి

గార్ల: సైబర్ నేరాలపై యువత అప్రమత్తంగా ఉండాలని ఎస్సై జీనత్‌కుమార్ విద్యార్థినులకు సూచించారు. బుధవారం గార్లలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో సైబర్ నేరాలపై ఆయన విద్యార్థులకు అవగాహన కల్పించారు.

మహబూబాబాద్ రూరల్: సైబర్ నేరాలు, నూతన చట్టాలపై విద్యార్థులకు అవగాహన ఉండాలని రూరల్ ఎస్సై వి.దీపికరెడ్డి అన్నారు. మండలంలోని కంబాలపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో బుధవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ జాకీర్, బ్లూకోల్ట్స్ కానిస్టేబుళ్లు రాజు, విజయ్, పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు పాల్గొన్నారు.

రిపోర్టు తప్పుగా ఇచ్చారని ఆందోళన


ఆందోళన చేస్తున్న బాధితుడి బంధువులు

నెహ్రూసెంటర్: జిల్లా కేంద్రంలోని స్కానింగ్ సెంటర్‌లో స్కానింగ్ రిపోర్టు తప్పుగా ఇచ్చారని ఆరోపిస్తూ స్కానింగ్ సెంటర్ ఎదుట బాధితుడి బంధువులు ఆందోళనకు దిగిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. బాధితుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. మొగిలిచర్ల గ్రామం జగ్యతండాకు చెందిన బాదావత్ శ్రీనివాస్ కడుపునొప్పితో బాధపడుతూ ఓ ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లగా డాక్టర్ పరీక్షించి స్కానింగ్ చేసుకోవాలన్నారు. దీంతో మైత్రి స్కానింగ్ సెంటర్‌లో స్కానింగ్ చేయగా అపెండెక్స్ నొప్పి అని రిపోర్టు ఇచ్చారన్నారు. వెంటనే జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో వైద్యులు ఈనెల 28వ తేదీన ఆపరేషన్ చేశారని, ఆపరేషన్ చేసిన డాక్టర్ అపెండెక్స్ లాంటిదేమి లేదని చెప్పారు. తప్పుడు రిపోర్టు ఇవ్వడం కారణంగానే ఆపరేషన్ చేయాల్సి వచ్చిందంటూ స్కానింగ్ సెంటర్ ఎదుట బాధితుడి బంధువులు ఆందోళనకు దిగారు. ఈవిషయమై ఆపరేషన్ చేసిన డాక్టర్‌ను వివరణ కోరగా ఆపరేషన్ చేసిన సమయంలో అపెండెక్స్ కనిపించలేదని, సిటీ స్కానింగ్ చేస్తే ఉందో లేదో తెలుస్తుందన్నారు.

'మా భూమిని ఇతరులకు పట్టా చేయొద్దు'



నిరసన తెలుపుతున్న దంపతులు

పెద్దవంగర: 'మేము కాస్తులో ఉన్న భూమిని ఇతరులు పట్టా చేసుకున్నారు. మాకు పట్టా చేయాలంటే ధరణి నిబంధనలు అడ్డు వస్తున్నాయి. మా భూమిని ఇతరుల పేర పట్టా చేయొద్దు' అని ఓ రైతు దంపతులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండల కేంద్రంలో బుధవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. పెద్దవంగర మండలం పోచారం గ్రామానికి చెందిన కాలేరు సోమయ్యకు గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 98/1లో 3 ఎకరాల 2 గుంటల భూమి ఉంది. ఈ భూమిని గతేడాది డిసెంబర్‌లో ఇదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పట్టా చేసుకొని మరో వ్యక్తికి విక్రయానికి పెట్టాడు. విషయం తెలుకున్న సోమయ్య దంపతులు తన భూమి తనకు పట్టా చేయాలని రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగినా తాము ఏమి చేయలేమని అధికారులు చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆత్మహత్యాయత్నం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసు అధికారులు అక్కడికి చేరుకొని సోమయ్య దంపతులను అక్కడి నుంచి పంపించారు. తహసీల్దార్ మహేందర్‌ను వివరణ కోరగా.. నిబంధనల మేరకు నడుచుకుంటున్నామని తెలిపారు. సమస్యలు ఏమైన ఉంటే కోర్టు ద్వారా పరిష్కరించుకోవాలన్నారు. కోర్టు నుంచి ఎలాంటి అదేశాలు వచ్చిన దాని ప్రకారం నడుచుకుంటామని తహసీల్దార్ తెలిపారు.

సంక్షిప్త సమాచారం

బీజేవైఎం పట్టణ అధ్యక్షుడిగా రిషి



మహబూబాబాద్ అర్బన్: బీజేవైఎం పట్టణ అధ్యక్షుడిగా జిల్లా కేంద్రానికి చెందిన మోరపాక రిషిని నియమించినట్లు బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సిరికొండ సంపత్ బుధవారం తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

తొర్రూరు: గ్రామీణ ప్రాంతాల్లో పని చేసే వీఆర్ఏల వాటాదారుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బాధిత కుటుంబాల సభ్యులు స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట బుధవారం నిరసన తెలిపి, పలు డిమాండ్స్‌తో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ కార్యాలయంలో అందించారు. షరీఫ్, రామచంద్రు, సంతోష్, నిజాం, రవీందర్, సాయి, హుస్సేన్, జానీ, సైదా పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుడికి సన్మానం

తొర్రూరు: ఆర్టీసీ డిపోలో విధులు నిర్వర్తించి పదవీ విరమణ పొందిన కార్మికుడు బద్దం వెంకట్‌రెడ్డి దంపతులను ఆర్టీసీ రీజినల్ మేనేజర్ విజయబాను, డిప్యూటీ ఆర్‌ఎం మాదవరావు, డిపో మేనేజర్ పద్మావతి సత్కరించారు.

గిరిజన ఐక్యతను చాటుదాం..

మహబూబాబాద్ రూరల్: తీజ్ పండుగను ఒకే సారి నిర్వహించి లంబాడ గిరిజన జాతి ఐక్యతను చాటుదామని సేవాలాల్ సేన రాష్ట్ర కోకన్వీనర్ ధరావత్ వెంకన్ననాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఎస్పీని కలిసిన ఎస్సైలు

మహబూబాబాద్ రూరల్: ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకను ఏఎస్సై నుంచి ఎస్సైగా పదోన్నతి పొందిన లింగయ్య, వెంకటరమణ బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు.

గుంతల పూడ్చివేత

డోర్నకల్: మండలంలోని ఉయ్యాలవాడ గ్రామంలో వర్షాలతో బురదమయమైన వీధుల్లో డస్ట్, చిప్స్‌తో మరమ్మతులు చేశారు. వీధుల్లో వర్షాలతో బురద గుంతలు ఏర్పడటంతో కాంగ్రెస్ మండల నాయకుడు తాళ్లూరి హనుమంతరావు సొంత ఖర్చుతో గుంతలను పూడ్చించారు.

విజయవంతం చేయాలి

డోర్నకల్: హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో రేపు (శుక్రవారం) జరిగే సీఎం కృతజ్ఞత సభను ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని పీఆర్టీయూ మండల అధ్యక్షుడు సీతారాములు కోరారు. డోర్నకల్‌లో బుధవారం నిర్వహించిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పీఆర్టీయూ నాయకులు డీఎస్ వినోద్‌కుమార్, ప్రభుదాస్, శ్రీధర్, రమేష్ పాల్గొన్నారు.

చెక్కు అందజేత

చిన్నగూడూరు: మండల కేంద్రానికి చెందిన గాడిపల్లి నిర్మల, జంపాల రామనర్సింహులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కును బుధవారం కాంగ్రెస్ మండల కార్యదర్శి సుధగాని నగేష్ అందజేశాడు.

అవార్డు ప్రదానం

మహబూబాబాద్: జిల్లా కేంద్రానికి చెందిన డాక్టర్ పి.అశోక్‌కు స్వచ్ఛంద సేవా సంస్థ బికన్ ఆఫ్ ఎంపవర్‌మెంట్ అవార్డును ప్రదానం చేసింది. అంతర్జాతీయ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఎఫ్ఎంఎం స్వచ్ఛంద సేవా సంస్థ మంగళవారం రాత్రి హనుమకొండలో అవార్డు ప్రదానం చేసింది.

బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి

గార్ల: పాకాల ఏటిపై హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరుతూ అఖిలపక్షం నాయకుల ఆధ్వర్యంలో పాకాల ఏటి వద్ద రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర నాయకుడు కట్టెబోయిన శ్రీనివాసరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్‌నాయక్, వెంకన్న, నర్సింహారావు పాల్గొన్నారు.

టాయిలెట్ల సమస్యలు తీర్చాలి

కురవి: మండలంలోని నేరడ జెడ్పీ హైస్కూల్‌లో టాయిలెట్స్ సమస్యను తీర్చాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కోకన్వీనర్ గంధసిరి జ్యోతిబసు అన్నారు. బుధవారం నేరడలోని జెడ్పీ హైస్కూల్‌ను సంఘం ఆధ్వర్యంలో సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కొలిపాక వీరేందర్, స్వప్న, సునీత, రేష్మ, రమేష్ పాల్గొన్నారు.

లక్ష్మి ఆశయ సాధన కోసం పోరాడాలి

కురవి: విద్యుత్ షాక్‌తో మృతి చెందిన సీపీఎం మండల కమిటీ సభ్యురాలు చెలగొల్ల లక్ష్మీ ఆశయ సాధన కోసం పోరాడాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు జి.నాగయ్య పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని నేరడ గ్రామంలో లక్ష్మీ సంతాపసభకు హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం గ్రామ శాఖ కార్యదర్శి ఉప్పలయ్య, కృష్ణారెడ్డి, చుక్కయ్య, స్కైలాబ్‌బాబు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

మహబూబాబాద్: మున్సిపల్ కార్మికుల మూడునెలల పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని ఏఐటీయూసీ జిల్లా నాయకుడు రేషపల్లి నవీన్ డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో బుధవారం మున్సిపాలిటీ కార్యాలయంలో కమిషనర్ రవీందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా నవీన్ మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికులకు వేతనాలు రాక అప్పులు చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రావణ్, రమణ, రాములు, రామ్మూర్తి, రాము పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న గీత కార్మికుడి మృతి

తొర్రూరు రూరల్: ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి జారిపడి తీవ్ర గాయాలతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ గీత కార్మికుడు బుధవారం మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మండలంలోని అరిపిరాల గ్రామానికి చెందిన రాయిపెల్లి పెద్ద సోమయ్య(64) మూడురోజుల క్రితం తాటి చెట్టు ఎక్కి కల్లు తీస్తుండగా ప్రమాదవశాత్తు జారి కింద పట్టాడు. తీవ్రగాయాలు కావడంతో ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించి వైద్యం అందిస్తుండగా మృతి చెందాడు. మృతుడి కుమారుడు యాకయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్సై జగదీష్ తెలిపారు.

ఏడుగురి బైండోవర్

నర్సింహులపేట: మండలంలోని వివిధ గ్రామాల్లో గుడుంబా, మద్యం అమ్మకాల్లో కేసులైన ఏడుగురుని బుధవారం పోలీసులు తహసీల్దార్ నాగరాజు ఎదుట బైండోవర్ చేశారు. గ్రామాల్లో మద్యం, గుడుంబా అమ్మకాలు చేయవద్దని, కేసులపాలు కావద్దని తహసీల్దార్ తెలిపారు.

వరదలో చిక్కుకున్న గేదెలు

బయ్యారం: మండలంలోని గంధంపల్లి–కొత్తపేట సమీపంలోని అలిగేటి వరద ప్రవాహంలో మూడు గేదెలు చిక్కుకోగా ఒక గేదె మృతి చెందగా మరో రెండు గేదెలు నీటిలోనే ఉన్నాయి. వివరాలు ఇలా ఉన్నాయి. గంధంపల్లి–కొత్తపేట గ్రామానికి చెందిన డేరెంగుల శ్రీనుకు చెందిన గేదెలు అలిగేటిపై ఉన్న చెక్ డ్యాం నీటి ప్రవాహంలోకి వెళ్లడంతో నీటిలో చిక్కుకున్నాయి. ఈ క్రమంలో ఒక గేదె మృతి చెందగా మరో రెండు గేదెలు రాత్రి వరకు నీటిలోనే ఉన్నాయి. రక్షించేందుకు స్థానికులు ప్రయత్నించినప్పటికీ చీకటి పడటంతో ప్రయత్నాలు సఫలం కాలేదు.